ఈనాడు
మహబూబాబాద్
బుధవారం సెప్టెంబరు 25, 2024

మానుకోటలోనే ఆర్‌సీవో కార్యాలయం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గిరిజన రీజనల్ కో-ఆర్డినేటర్(ఆర్‌సీవో) కార్యాలయం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనే కొనసాగుతుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయాన్ని ములుగు జిల్లాకు తరలిస్తున్నారని కొందరు చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. కొందరు వ్యక్తులు కావాలనే ఈ అంశాన్ని రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా ఉప ఆర్‌సీవో కార్యాలయాన్ని మాత్రమే ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

సంక్షేమ వసతి గృహాల తనిఖీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని హస్తినాపురం కాలనీలో ఉన్న ఎస్సీ(సి), ఎస్సీ(డి) వసతి గృహాలతో పాటు ఎస్సీ బాలుర కళాశాల, ఎస్టీ బాలుర కళాశాల వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంక్షేమ అధికారికారిని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.


మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కోడి కూయక ముందే..
మద్యం జోరు!



రహదారులపైనే తాగుతూ.. ఊగుతూ...!

టాస్క్‌ఫోర్స్

మీకు తెలుసా.. 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019–22 ప్రకారం.. దేశంలో అత్యధికంగా తాగుడు అలవాటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.. రాష్ట్రంలో 43 శాతం మందికి మద్యం తాగే అలవాటున్నట్లు వెల్లడైంది. మరోవైపు మద్యానికి బానిసై.. డీఅడిక్షన్ కేంద్రాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.'

వరంగల్‌క్రైం, నెహ్రూసెంటర్, గూడూరు, న్యూస్‌టుడే

ఒకప్పుడు పండగకో.. పబ్బానికో మద్యం తాగేవారికి.. ఇప్పుడు సమయం.. సందర్భం అవసరం లేదనిపిస్తోంది. ఎప్పుడు పడితే.. అప్పుడే.. ఎక్కడపడితే అక్కడే.. అది అందుబాటులో ఉండడంతో.. చాలామంది దానికి బానిసలవుతున్నారు. మద్యం దుకాణాలకు తోడు గల్లీకో బెల్టుషాపు దర్శనమిస్తోంది. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో కోడి కూయకముందే..రాత్రి ఒంటిగంట వరకు బార్లు.. డోర్లు తెరుచుకుని ఉంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా.. ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం 'న్యూస్‌టుడే బృందం' నిర్వహించిన పరిశీలనలో సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, పలువురు రహదారుల పక్కనే కూర్చొని మద్యం తాగుతూ కనిపించారు.


మహబూబాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో రాత్రి పది గంటలు దాటినప్పటికీ మద్యం అమ్మకాలు


మహబూబాబాద్ జిల్లా గూడూరు ప్రాంతంలోని జాతీయ రహదారిపై మద్యం అనుబంధ దుకాణం

ఇవీ నిబంధనలు..

- మద్యం దుకాణాలు (వైన్స్) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉండాలి. బార్లు 11 వరకు అనుమతి ఉంటుంది.
- ప్రతి దుకాణానికి ప్రభుత్వం మద్యం తగడానికి గది అనుమతి ఇస్తుంది. అది లేనప్పుడు దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకొని వెళ్లాలి.
- వైన్స్ ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుండాలి.
- 21 ఏళ్ల లోపువారికి మద్యం అమ్మొద్దు.
- మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మొద్దు.
- జాతీయ రహదారులకు 225 మీటర్లలోపు మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు. గుడి, బడికి 100 మీటర్లలోపు ఉండొద్దు.
- మద్యం కల్తీ జరగకుండా పర్యవేక్షణ తప్పనిసరి.

ఇదీ పరిస్థితి..

- సాయంత్రం మద్యం దుకాణాలు జాతరను తలపిస్తున్నాయి. రహదారికి ఆనుకుని ఉన్నచోటవాహదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- రాత్రి 10 తర్వాతా మద్యం విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాన్ని తెరిచి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలకు సైతం అమ్ముతున్నారు.
- ప్రత్యేక సాకులు చూపి రహదారులపైనే నిర్వహిస్తున్నారు.
- మద్యం దుకాణాల వద్ద ఆహార పదార్థాలు, తినుబండారాలు అమ్మకూడదు. అధికారులు ఇవేవి పట్టించుకోరు.
- అనేక చోట్ల రోడ్డు వెంట ఉన్న మద్యం దుకాణాలతో సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- ఇష్టారీతిన అమ్మకాలు చేస్తున్నారు. క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిల్‌కు రూ.30, 50, 100 చొప్పున అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారు.

కళాశాల ఆవరణలో..

రాయపర్తి: రాయపర్తి మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు 170 మీటర్ల దూరంలో వైన్స్ ఏర్పాటు చేశారు. మందుబాబులు రాత్రి వేళల్లో కళాశాలకు వెళ్లే రహదారి, కళాశాలలో నిత్యం మద్యం తాగి సీసాలతో పాటు వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు.

గుడి వెనకాలే 'బార్ అండ్ రెస్టారెంట్'

మట్టెవాడ: వరంగల్‌లోని ప్రధాన కూడలిలో గోపాలస్వామి గుడి కూడలి ఒకటి. పోచమ్మమైదాన్ నుంచి ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లే మార్గంలో త్రిశక్తిపీఠం దేవాలయం ఉంది. ఈ దేవాలయానికి అత్యంత సమీపంలో మద్యం దుకాణాలున్నాయి.



నర్సంపేట పట్టణంలో 365 నంబరు జాతీయ రహదారికి ఆనుకునే నాలుగు దుకాణాలు ఉన్నాయి. రహదారి పక్కన, ఇతర దుకాణాల వద్ద నిల్చొని తాగుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– న్యూస్‌టుడే, నర్సంపేట

ఇక ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు

డోర్నకల్, న్యూస్‌టుడే: మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుంది. బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడమే కాకుండా స్వయం ఉపాధికి బాటలు వేస్తోంది. సంఘాల్లోని సభ్యులకు అనుభవం ఉన్న రంగంలో రాణించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి తోడ్పాటు అందిస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు నెలకొల్పే యోచన చేస్తోంది. జిల్లాలో ఇలాంటివి అయిదు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిని ఎక్కడెక్కడ ప్రారంభించాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదు. నియోజకవర్గ కేంద్రమైన డోర్నకల్‌లో మాత్రం ఒక ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు కానుంది. దీనిని ఈ నెలాఖరున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ప్రభుత్వ విప్ డా.రామచంద్రునాయక్ ప్రారంభించనున్నారు. మంగళవారం క్యాంటీన్ ప్రతిపాదిత ప్రదేశాన్ని డీఆర్డీవో మధుసూదన్‌రాజు పరిశీలించారు. వీటి నిర్వహణకు అవసరమైన నిధులు మండల సమాఖ్య, సీసీఎల్ నుంచి సమకూర్చుకునేలా ప్రణాళిక రూపకల్పన జరిగింది. డీఆర్డీవో మధుసూదన్‌రావు వెంట సెర్ప్ ఏపీఎం మాలోత్ శంకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి సుజాత, కోశాధికారి నాగమణి, సీసీలు స్వర్ణలత, రాధ, నళిని, మంజుల, కవిత ఉన్నారు.


డోర్నకల్‌లో క్యాంటీన్ ఏర్పాటు ప్రదేశం పరిశీలిస్తున్న డీఆర్డీవో

పట్టు తప్పితే.. ప్రమాదమే!

స్థానికంగా పనులు లభించని నేపథ్యంలో వ్యవసాయ కూలీలు దూర ప్రాంతాలకు వెళ్తున్నారు.. రోజూ మండలకేంద్రానికి చెందిన కూలీలు వందలసంఖ్యలో ఇలా వేరే గ్రామాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ఈక్రమంలో వారి ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోంది. ట్రాలీలు, ఆటోల్లో పరిమితికి మించి కొనసాగిస్తున్నారు. మంగళవారం బయ్యారం గ్రామానికి చెందిన మహిళలు ఇతర గ్రామాల్లో పనులకు వెళ్లి ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తూ కనిపించారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)



'జమిలి ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధం'

బయ్యారం, న్యూస్‌టుడే: అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీను పేర్కొన్నారు. వేజెళ్లసైదులురావు భవనంలో మంగళవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల ప్రజలకు జరిగే ప్రయోజనం ఏమిటో మోదీ ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 2021లో నిర్వహించాల్సిన జనాభా లెక్కలు ఇప్పటివరకు జరగలేదన్నారు. కులగణన త్వరగా చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం హామీలను అమలు చేసి పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజన్న, మధు, మల్లికాంబ, వెంకన్న, చంటి పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీను

వరద బాధితులను ఆదుకోవాలని వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో వరదలతో నష్టపోయిన బాధితులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆకేరు వాగులో వచ్చిన వరదలు అనేక మందిని నిరాశ్రయులను చేసిందని కొన్ని గ్రామాల్లో తీవ్రంగా నష్టపోయిన వారందరికి పరిహారం అందలేదన్నారు. అర్హులైనవారందరికీ పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితులకు సాయమందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాధితులకు ఆర్థిక సహాయం అందించడంలో కూడ మోసపూరితంగా మాట్లాడుతుందన్నారు. చెరువుల మరమ్మతులు, రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు.





తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకుల నిరసన

పేదల ఇళ్లు కూల్చొద్దు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో రెండు దశాబ్దాల కిందట ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని తలారి వెంకటేశ్వర్లు కాలనీ ఏర్పాటైందని అప్పటి నుంచి అక్కడే నివసిస్తున్న నిరుపేదల ఇళ్లను కూల్చొద్దంటూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ పురపాలక సంఘం ఫ్లోర్‌లీడర్ బి.అజయసారథి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో ఆ కాలనీకి చెందిన మద్దినేని నర్సమ్మ ఇల్లు కూలిపోయిందన్నారు. ఆ ఇంటిని పునర్నిర్మాణం చేసుకుంటుండగా రెవెన్యూ, పురపాలక అధికారులు కూలగొట్టారన్నారు. దాసరి నాగభూషణ్‌రావు కాలనీలో పేదలు నివసిస్తుంటే పెద్దల భవంతులను వదలి వరద కాలువను కాలనీకి మళ్లించి వారికి నోటీసులు పంపిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.

నిఘా నిద్రపోతోంది..!

నేరాల నియంత్రణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక గ్రామాల్లో అమర్చిన సీసీ కెమెరాలు కొన్ని ప్రాంతాల్లో పని చేయడంలేదు. నేను సైతం ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసినవి సైతం పూర్తిగా పని చేయడం లేదనే ఆరోపణలున్నాయి. సమస్యాత్మక గ్రామాల్లో నెలకొల్పిన సీసీ కెమెరాల ద్వారా సంబంధిత ఠాణాలో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అవి పూర్తిగా పని చేయడం లేదని తెలిసింది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, పట్టణ ప్రవేశ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు మరమ్మతుకు రావడంతో నిఘా కొరవడింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నెలకొల్పిన నిఘా నేత్రాలను మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నెహ్రూసెంటర్


వ్యవసాయ మార్కెట్ సమీపంలో మరమ్మతుకు గురైన సీసీ కెమెరా


సర్వేపల్లి రాధాకృష్ణ కూడలిలో కనెక్షన్ తొలగించిన సీసీ కెమెరా


మహబూబాబాద్ అండర్ బ్రిడ్జి సమీపంలో ఖాళీగా ఉన్న సీసీ కెమెరా స్టాండ్

కనిపించని ధాన్యం.. మిల్లు యజమానిపై ఫిర్యాదు


తనిఖీ చేస్తున్న పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్, తదితరులు

గూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని అప్పరాజుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్ మిల్లులో రూ.9.56 కోట్ల విలువైన 41,356 క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు మంగళవారం అధికారులు వెల్లడించారు. మంగళవారం పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు.. 2022-23 రబీ సీజన్‌లో వివిధ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేసిన 19,456 క్వింటాళ్ల ధ్యాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అందించింది. ఇందులో నుండి బియ్యాన్ని తిరిగి పౌరసరఫరాల శాఖకు అందించలేదు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో 32,240 క్వింటాళ్ల ధ్యానాన్ని అందించగా 21,900 క్వింటాళ్ల ధాన్యం కనిపించ లేదు. 2022-23 సీజన్‌లో రూ. 4,14,97,000 విలువ చేసే ధాన్యం, 2023-24 సీజన్‌లో రూ.5,41,76,000 విలువ చేసే ధాన్యం మొత్తంగా రూ.9,56,73,000 విలువ చేసే ధాన్యాన్ని పక్కదారి పట్టించి మిల్లు యజమాని ప్రభుత్వాన్ని మోసగించారని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ వెల్లడించారు. స్థానిక గూడూరు పోలీస్ స్టేషన్‌లో మిల్లు యజమాని భూక్య నవీన్‌పై రాతపూర్వక ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశామన్నారు. డీసీఎస్‌ఓ ప్రేమ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కృష్ణవేణి, తహసీల్దారు శ్వేత, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కృష్ణ, ఆర్‌ఐ మల్లయ్య తదితరులున్నారు.


ప్రమాదకరంగా నీటి గుంతలు దాటుతున్న విద్యార్థులు


ధ్వంసమైన కట్ట రహదారి

పనుల్లో జాప్యం.. రాకపోకలు కష్టం..!

చిన్నగూడూరు (మరిపెడ), న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవహించి పంటలు, రహదారులు దెబ్బతిన్నాయి. చిన్నగూడూరు - ఉగ్గంపల్లి మధ్య ఆకేరువాగు వంతెన ముందు రహదారి కోతకు గురైంది. ప్రస్తుతానికి మట్టి పోసి తాత్కాలిక మరమ్మతులతో రవాణా సౌకర్యం కల్పించారు. జయ్యారం నుంచి కందికొండ, సూధనపల్లి మీదుగా వెళ్లే రహదారిలో రామసముద్రం చెరువు ఉప్పొంగి రహదారి రెండు చోట్ల కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దెబ్బతిన్న రహదారులను మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, డోర్నకల్ శాసనసభ్యుడు రామచంద్రునాయక్ పరిశీలించి త్వరితగతిన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 24 రోజులు దాటుతున్న పునరుద్ధరణ పనుల్లో వేగం కొరవడంది. రాకపోకల్లో ఇబ్బందులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలిక మరమ్మతు పనులు ఎమ్మెల్యే రామచంద్రునాయక్ చొరవతో చేపడుతున్నట్లు స్థానిక నేతలు తెలపారు.

❒ మంగోళిగూడెం, మన్నెగూడెం గ్రామాల విద్యార్థులు జయ్యారం పాఠశాలకు వెళ్లేందుకు రామసముద్రం చెరువుకట్టపై ఉన్న రహదారి మీదుగా వెళ్లాలి. వరద ఉద్ధృతికి రహదారి కొట్టుకపోగా పునరుద్ధరణ పనుల్లో జాప్యం నెలకొంది. దీంతో రోజూ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల నుంచి దెబ్బతిన్న రహదారి వరకు ఆటోల్లో వచ్చి నీళ్ల గుంతల నుంచి ప్రమాదకరంగా వెళ్తున్నారు.

☛ రహదారి పూర్తి స్థాయి నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించామని ఇరిగేషన్ డీఈ పొట్టయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

సామాజిక తనిఖీలో బయటపడ్డ అవకతవకలు

పెద్దవంగర, న్యూస్‌టుడే: ఏడాదిగా నిర్వహించిన గ్రామీణ ఉపాధి హామీ పథకం 3వ విడుత సామాజిక తనిఖీ మంగళవారంతో ముగిసిందని, తనిఖీల్లో అవకతవకలు బయటపడ్డాయని అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. . మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గత రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించామని మండలంలోని 20 గ్రామపంచాయతీలకు గాను రూ.9 కోట్లతో మనఊరు-మనబడి, ఈజీఎస్ పనులు, అంతర్గత సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. అందులో రూ.7.15 లక్షల పనులకు పూర్తిగా ఆధారాలు లేవని, సంబంధిత అధికారుల నుండి రికవరీ చేస్తామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శుల పనితీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ అధికారి ఆదమ్, ఎంపీడీవో వేణుమాధవ్, కార్యదర్శులు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో శాంతకుమారి

మాజీ సర్పంచికి మూడేళ్ల జైలు

తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరు మాజీ సర్పంచి రాజేష్‌నాయక్‌పై 2013లో నమోదైన కేసు విషయంలో మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.4వేల జరిమానా విధిస్తూ తొర్రూరు సీనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత మంగళవారం తీర్పు వెలువరించారని స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2013లో ఆయన సర్పంచిగా పనిచేసిన సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారని కేసు నమోదైందన్నారు. అప్పటి నుంచి విచారణ జరుగుతుండగా, మంగళవారం సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టగా, పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి పైవిధంగా తీర్పును వెలువరించారని ఎస్సై పేర్కొన్నారు.

కల్తీ ముప్పు.. కనిపెడితేనే మేలు..!



‘తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ తయారీలో జరిగిన తప్పిదాలపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న నేపథ్యంలో కల్తీపై అంతటా చర్చ జరుగుతోంది. ఆ బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంలోనే కాదు మన నిత్య జీవితంలో వాడే ఆహారపదార్థాల్లోనూ కల్తీ జరుగుతోంది. దీన్ని గుర్తించి జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనదే’

ప్రస్తుతం కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా రోజులు మారాయి. విపణిలో కల్తీ ఆహార పదార్థాలు రాజ్యమేలుతున్నాయి. మనం చూసే ప్రతిదీ అందంగా ఆకర్షించేలా కనిపిస్తున్నా లోపల మాత్రం ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు జోడించి తయారు చేసిన ఉత్పత్తులుంటున్నాయి. నిత్యం ఆరోగ్య రక్షణకు వినియోగించే సర్వరోగ నివారిణి తేనె, తాగే పాలు మొదలు వంటకాల్లో వాడే నూనె, కారం, పసుపు నుంచి మసాల వరకు కల్తీ బారిన పడినవే. వాటిని తింటూ వ్యాధులను కొనితెచ్చుకుంటున్నాం. ఈ నేపథ్యంలో పదార్థాల నాణ్యత తనిఖీ చేయడం అవసరం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన పద్ధతి ప్రకారం ఇంట్లోనే కల్తీని గుర్తించే విధానంపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్



పాలు



● **కల్తీ చేసే పదార్థాలు:** స్టార్చ్ (పిండి పదార్థాలు), డిటర్జెంట్ పౌడర్

● **గుర్తించే విధానం:** 5-10 ఎం.ఎల్., పాలు తీసుకుని వాటికి సమానమైన నీటితో బాగా కలపాలి. డిటర్జెంట్ కలిసి ఉంటే చిక్కని నురగ వస్తుంది. స్వచ్ఛమైన పాలు అయితే సన్నని నురగ పొర ఏర్పడుతుంది.

పాలను వేడి చేసి అందులో కొన్ని చుక్కల అయోడిన్ వేస్తే అవి నీలం రంగుగా మారితే స్టార్చ్ (పిండిపదార్థాలు)లతో కల్తీ చేసినట్లే.

కారం



● ఇటుక పొడి, సింథటిక్ కలర్

● గాజు గ్లాసులో నీటిని తీసుకుని అందులో మిరపపొడిని వేయాలి. ఇటుక పొడి ఉంటే అది నీటి అడుగుభాగానికి చేరుతుంది. గాజు పాత్రలో నీటిపై కారం పొడిని వేస్తే కృత్రిమ (సింథటిక్) రంగు చారల రూపంలో కిందికి దిగుతుంది.

నల్ల మిరియాలు



● బొప్పాయి గింజలు

● ఒక గ్లాసు నీటిలో కొంత మొత్తంలో నల్ల మిరియాలు వేయాలి. స్వచ్ఛమైనవి అడుగు భాగానికి చేరుకుంటాయి. బొప్పాయి గింజలు నీటిపై తేలుతాయి.

తేనె



● చక్కెర ద్రావణం

● స్వచ్ఛమైన తేనెకు మండే స్వభావం ఉంటుంది. నాణ్యమైన తేనెలో పత్తిని ముంచి మండిస్తే మండుతుంది. ● ట్రాన్స్‌పరెంట్ గ్లాసు పాత్రలో నీళ్లు తీసుకోవాలి. అందులో కొద్దిగా తేనె వేస్తే అది విడిపోతే అందులో చక్కెర ఉన్నట్లు గుర్తించాలి. ● గిన్నెలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా తేనెను వేసి వేడి చేయాలి. అప్పుడు చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తే చక్కెర కలిపినట్లు. కల్తీ జరగకుంటే ఎలాంటి శబ్దం రాదు. ● ఒక గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకొని అందులో ఒక చెంచా తేనె కలిపి కాస్త వెనిగర్ వేయాలి. నురగ వస్తే అది కల్తీ అయినట్లు.

కాకరకాయ, పచ్చిమిర్చి, ఇతర ఆకుకూరలు



● ఆకర్షించేలా కృత్రిమ రంగు పూయడం

● నీటిలో, వెజిటబుల్ ఆయిల్‌లో ముంచిన పత్తి దూదిని తీసుకోవాలి. దాన్ని కూరగాయాలపైన రుద్దాలి. దూది ఆకుపచ్చగా మారితే వాటిని కృత్రిమ రంగుతో కల్తీ చేసినట్లు.

నెయ్యి



● పిండిపదార్థం

● గాజు గ్లాసులో కొద్దిగా నెయ్యిని తీసుకొని అయోడిన్ ద్రావణాన్ని కలపాలి. నీలంరంగులోకి మారితే పిండి పదార్థాలతో కల్తీ చేసినట్లు.

ఒక చెంచా నెయ్యిని ఒక గ్లాసు నీటిలో కలిపితే స్వచ్ఛమైన నెయ్యి ఉపరితలంపై తేలుతుంది. నీటిలో కలిసినా, దిగువకు చేరితే అది నూనెలతో కల్తీ కావాచ్చని అర్థం.

పసుపు



● మెటానిల్ ఎల్లో, సన్‌సెట్ ఎల్లో, బియ్యం పిండి

● పరీక్ష నాళికలో కొద్దిగా పసుపు పొడిని తీసుకొని నీటిని కలపాలి. గాఢమైన పసుపు రంగు ఏర్పడితే కల్తీ జరిగినట్లు. బియ్యం పిండి ఉంటే నీటి అడుగులోకి చేరుతుంది.

కంది, పెసర పప్పు



● కేసరి పప్పు, మెటానిల్ ఎల్లో రంగు, టెట్రాజయిన్

● కేసరి పప్పు పలుకులుగా ఉంటుంది. దీన్ని భూతద్దం సహాయంతో గుర్తించొచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా కంది/పెసర పప్పును తీసుకొని కొద్దిగా నీటిని కలిపి దానికి 5మి.లీ. గాఢ హైడ్రోక్లోరికామ్లం కలిపి 10 నిమిషాల తర్వాత పరిశీలిస్తే గులాబీ రంగులో మారితే కల్తీ జరిగినట్లు.

టీ/కాఫీ పొడి



● ఇనుప పొడి, కృత్రిమ రంగులు, చింతగింజల పొడి

● టీపొడిని కొద్దిగా తెల్లని కాగితంపై పలచగా పోసి దాంట్లో అయస్కాంతాన్ని తిప్పితే ఇనుప పొడి దానికి అతుక్కుంటుంది.
● చల్లని నీటిలో టీపొడిని కలిపితే 30 సెకన్లలోనే నీటి రంగు మారితే అది కల్తీ అయినట్లు.
● కాఫీ పొడిని చల్లని నీటిలో బాగా కలిపాలి. కాఫీ పొడి నీటిపై తేలి చింతగింజల పొడి ఉంటే అడుగు భాగానికి చేరి నీటిని మట్టి రంగులోకి మారుస్తుంది.

అనారోగ్య సమస్యలివే..



కల్తీ ఆహార ఉత్పత్తులను తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, పక్షవాతం, క్యాన్సర్, కంటి వ్యాధులు సంభవిస్తాయి. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.



– డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, ఎండీ ఫిజిషియన్

వేరుశనగ, నువ్వుల నూనె



● సోయాబిన్, ఆర్జిమోజన్ నూనె

● ఒక పరీక్షనాళికలో కొద్దిగా నూనె, 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లం, కొద్దిగా పంచదార కలిపాలి. పరీక్ష నాళిక దిగువన గులాబీ, ఎరుపు రంగు ఏర్పడితే నూనెలు కల్తీ అయినట్లు.

కొబ్బరి నూనె



● మినరల్ ఆయిల్, పామ్ కెర్నల్

● శుద్ధమైన కొబ్బరి నూనెను ఫ్రిజ్‌లో పెట్టి అరగంట తర్వాత చూస్తే పూర్తిగా గడ్డకడుతుంది. సగం గడ్డకట్టి.. సగం కట్టకుంటే కల్తీ అయినట్లు.

ఇవి కూడా..



● అందరూ ఎంతో ఇష్టంగా తినే మిఠాయిల్లో రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. 100 పీపీఎం కంటే ఎక్కువగా కలిపిన మిఠాయిలను తింటే అనారోగ్యానికి దారి తీస్తాయి.

ఇటీవల వరంగల్ జిల్లాలో ఒక మిఠాయి దుకాణంలో ఆహార భద్రతా అధికారులు వాటిని గుర్తించి జరిమానా విధించారు.

● కొబ్బరి పొడిలోనూ నాణ్యత లేనిది ఉంటుంది. కొబ్బరిపొడిలో 55శాతం నూనె ఉండాలి. లేకుంటే నాణ్యత లేనట్లు.

హనుమకొండలో 45 శాతం నూనె ఉన్న ఒక కంపెనీకి చెందిన కొబ్బరి పొడిని స్వాధీనం చేసుకున్నారు.



వారసంతల్లో ఎక్కువగా..

ఇది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని వారసంత. ప్రతి మంగళవారం నిర్వహిస్తారు. వంటింట్లోకి అవసరమైన అన్ని సరకులను ఇలా పెట్టి విక్రయిస్తారు. ఇక్కడ కల్తీ ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. పసుపు, పప్పులు, ఉల్లిగడ్డలు, సుగంధ ద్రవ్యాలు ఇలా ప్రతిదీ నాణ్యత లినివే ఉంటాయి. ఈ విషయం తెలియని చుట్టుపక్కల గ్రామాలు, తండాల్లోంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఇలా చేద్దాం

కారం పొడిని రైతుల వద్ద, ఎండు మిర్చి విక్రయాలు చేసే దుకాణాల వద్ద ఏడాదికి సరిపడా కొనుగోలు చేసి మరాడించుకుని భద్రపరుచుకుంటే చాలు. కల్తీ కారం నుంచి బయటపడొచ్చు. ఇలా కాకుండా ప్యాకెట్లలోని కారం కొనుగోలు చేయాలనుకుంటే ఆహార పరిరక్షణ ప్రమాణాల ప్రకారం ఉందా లేదా చెక్ చేసుకుని కొనాలి.

● గేదెలు సాకుతూ పాలను పట్టణాల్లోకి తీసుకొచ్చి విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయాలి. గ్రామాల్లో ఆవులు, గేదెలను పోషిస్తూ వాటి పాల ద్వారా నెయ్యిని తీసి విక్రయాలు చేస్తారు. వారి వద్ద నాణ్యమైంది లభిస్తుంది.. దానికి ధర అధికంగా ఉన్నా కొనుగోలు చేయడం ఉత్తమం.

● పసుపు సాగు చేసే కొందరు రైతులు దాన్ని ఉడికించిన తర్వాత పసుపు పొడిగా మరాడించి విక్రయాలు చేస్తారు. వారి వద్ద కొంటే కల్తీ బారి నుంచి తప్పించుకోవచ్చు.

● తేనె రోడ్లపక్కన పెట్టి విక్రయాలు చేసే వారి వద్ద కొనుగోలు చెయ్యొద్దు. గ్రామాలు, ఏజెన్సీ గూడేలు, తండాల్లో చెట్లకు ఉన్న తుట్టెల ద్వారా సేకరించిన తేనెను గానీ, తేనెటీగల పెంపకం చేపడుతూ తేనె విక్రయించే వారి వద్ద తీసుకోవాలి. కొన్ని అధీకృత కంపెనీల వారు మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. వాటిని కూడా కొనుగోలు చెయ్యొచ్చు.

‘దోచుకోవడం, దాచుకోవడం తప్ప భారాస చేసిందేమీ లేదు’



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత పదేళ్లలో భారాస ప్రభుత్వం రూ. లక్షల కోట్ల అప్పులు చేసిందని, తీవ్ర ఆర్థిక లోటు ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీలేదని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాల్లో అయిదు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. భారాస ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం నాలుగైదు కార్పొరేటు ఆసుపత్రులకు మాత్రమే ఎల్వోసీలు ఇచ్చారన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, విద్య, వైద్యం, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక



ప్రముఖుల ఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్.. చిత్రంలో పాలనాధికారి రాహుల్ శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్ర మలివిడత అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది.. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలపైనా దృష్టి సారించారు. కాళేశ్వర క్షేత్ర సన్నిధిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులతో క్షేత్ర అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్మాణాలు ఎంతమేరకు పూర్తి కావచ్చాయి..? మిగతా నిర్మాణాల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈవో మారుతిని ప్రశ్నించారు. సత్వరమే నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. రాబోయే సరస్వతీ పుష్కరాలకు ఏవిధంగా ప్రణాళిక చేస్తే బాగుంటుందని అధికారుల వద్ద సలహాలు తీసుకున్నారు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులను పలు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద బృందావన్ గార్డెన్ మాదిరి పర్యాటక ప్రాంతం అవసరమని, చిన్న మ్యూజియం ఏర్పాటు చేస్తే సందర్శకులు, చిన్నారి విద్యార్థులకు గొప్ప అనుభూతి కలిగిస్తుందని పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి సూచించారు. బృహత్తర ప్రణాళిక అమలుకు ముందు ఆలయ నిర్మాణాల తీరుపై శృంగేరి పీఠం వారికి వివరించాలని దేవాదాయశాఖ స్థపతి వల్లీ నాయగం సూచించారు. రూ.115 కోట్లతో కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జీఎం వివరించారు. గోదావరి తీర ప్రాంతం అపరిశుభ్రతకు తావులేకుండా పవిత్రతకు మారుపేరులా ఉండాలని శైలజారామయ్యర్ ఆదేశించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం అతిథిగృహాలు అస్తికలు నిమజ్జనం చేసే భక్తులకు ఆలయ సిబ్బంది ఇవ్వడం లేదని కాళేశ్వరాలయం మాజీ ఛైర్మన్ కోటరాజ బాపు, మాజీ ధర్మకర్త అశోక్ ఆమె దృష్టికి తీసుకురాగా ఈవోపై మండిపడ్డారు. క్షేత్ర ఆవరణలో భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ టాయిలెట్స్ నిర్మాణాలు జరగాలని ఆదేశించారు.

నిజాయతీతో సేవలందిస్తే గుర్తింపు



సీపీని కలిసిన ఎస్సైలు అభ్యర్థులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రజలకు నీతి, నిజాయతీతో సేవలందిస్తే మంచి గుర్తింపు ఉంటుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన శిక్షణ పొందిన 19 మంది ఎస్సైలు మంగళవారం కమిషనరేట్‌లో సీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. చట్టం పరిధిలో సేవలు అందిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్ఠలు పెంచాలన్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు



మల్లకపల్లి శివారులో మొరం కోసం వచ్చిన వాహనాలు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ధర్మసాగర్ మండలం మల్లకపల్లి నుంచి రాంపూర్‌కు వెళ్లే దారిలో గుట్టల నుంచి మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఏడాదికి పైగా గుట్టలను కొల్లగొడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు ప్రకృతి సంపదను దోచుకుంటున్నా అధికారులు ఎవరూ స్పందించడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఊర చెరువు సమీపంలోని క్వారీ నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాంపూర్ మీదుగా హనుమకొండ, వరంగల్ నగర శివార్లలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదే రహదారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే మల్లకపల్లి రైతులు, పనులకు వెళ్లే కూలీలు నిత్యం తిరిగే వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక బరువుతో భారీ వాహనాలు తిరగడం ద్వారా రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం రాయల్టీ నష్టపోతున్నా, రోడ్లు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుకున్న ఎండు గంజాయితో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుషకుమార్, సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే: రెండు కార్లలో తరలిస్తున్న 187 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన రాహుల్ మంజుదార్ (22), రాయపూర్‌కు చెందిన హరీష్ యాదవ్ (24), ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరికి చెందిన మండల నరేష్ (32)లతో ఎండు గంజాయిని ఒడిశా నుంచి భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్, గూడూరు మీదుగా హైదరాబాద్ తరలించేందుకు ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరి జిల్లాకు చెందిన బాపన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. రాహుల్ మంజుదార్, హరీష్ యాదవ్, మండల నరేష్ ఒడిశా నుంచి రెండు కార్లలో హైదరాబాద్ బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మండలంలోని మచ్చర్ల గ్రామం స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వస్తున్న రెండు కార్లను ఆపి సోదా చేయగా సుమారు రూ.46.76 లక్షల విలువైన 187.04 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చేసుకొని రాహుల్ మంజుదార్, మండల నరేష్, హరీష్ యాదవ్, బాపన్‌లపై కేసు నమోదు చేసి రెండు కార్లు, మూడు చరవాణులను స్వాధీనం చేసుకున్నారు.

‘ఐటీఐ’లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చందర్ తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో 5వ విడత ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 83741 01790లో సంప్రదించాలన్నారు.

ఎనుమాములు పనులు

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏడాది క్రితం రూ.17.07 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు అటకెక్కాయి. గతేడాది ఆగస్టు 16న అప్పటి పాలకవర్గం గడువు ముగిసే రెండు రోజుల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణ పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక.. మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో.. నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. మరోవైపు పనులకు సంబంధించి అప్పటి పాలకవర్గానికి, మార్కెట్ అధికారులకూ కమీషన్లు అందినట్లు ఆరోపణలున్నాయి. అందుకే తమ హయాంలోనే పనులు ప్రారంభించాలని.. వేగిరపడినట్లు తెలుస్తోంది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్



అపరాల యార్డులో కమీషన్ దుకాణాల నిర్మాణాల పనులను మధ్యలోనే నిలిపేసిన గుత్తేదారు

రూ.కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కారణంగా.. ఫీజు రూపంలో మార్కెట్‌కు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. గతేడాది ఫీజు రూపంలో రూ.43.39 కోట్ల ఆదాయం సమకూరగా.. ఈ ఏడాది రూ.56 కోట్ల ఆదాయాన్ని సాధించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్ అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాలు లేక మార్కెట్‌లోని యార్డులు చీకటిగా ఉంటున్నాయి. పత్తి, మిర్చి సీజన్లలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతు విశ్రాంతి భవనంలో మౌలిక సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాథమిక వైద్యశాలకు పూర్తిస్థాయిలో వైద్యపరికరాలు, మందులు సమకూర్చేందుకు తగిన నిధులు కేటాయించకపోవడంతో.. రైతులతో పాటు మార్కెట్‌లోని కూలీలు, హమాలీలు, వ్యాపారులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కెట్ పాలకవర్గం గడువు ముగిసి ఏడాది పూర్తయినా, మార్కెట్ అనేక సమస్యలతో సతమతమవుతున్నా.. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు పాలకవర్గం నియామకంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. పత్తి, మిర్చి సీజన్లలో రైతులకు మద్దతుగా నిలవాల్సిన పాలకవర్గం ఏడాది నుంచి లేకపోవడంతో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

● అభివృద్ధి పనులు	● కేటాయించిన నిధులు(రూ.లక్షల్లో)	● ఇప్పటివరకు ఖర్చు (రూ.లక్షల్లో)
ధాన్యం, అపరాల యార్డులో ఉప కార్యాలయం నిర్మాణం	47	22.22
మిర్చి యార్డులోని ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	444	191
పసుపు, పల్లికాయ యార్డులో ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	293	64.77
మార్కెట్ రెండో గేట్ వద్ద కళాతోరణం నిర్మాణం	29	26.22
మార్కెట్ రెండో గేట్ వద్ద ఎడ్లబండ్లు, రైతుల ప్రతిమలు ఏర్పాటు	9.20	8.50
ధాన్యం, అపరాల యార్డులో 24×12 వైశాల్యంతో కొత్తగా 40 దుకాణాల నిర్మాణం	420	73.01
పత్తియార్డు కార్యాలయ మరమ్మతు పనులకు	17	0
పత్తియార్డు చుట్టుపక్కల ఉన్న డివైడర్లకు, బారికేడ్లకు సింథటిక్ పెయింటింగ్ పనులకు	10	0
మార్కెట్ చుట్టూ ప్రహరీ పనులకు	20	0
లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ప్రాంతీయ, జిల్లాస్థాయి మార్కెటింగ్ అధికారుల భవన సముదాయ నిర్మాణం	418	76.32



వేరుశనగ యార్డులో అసంపూర్తిగా షెడ్డు నిర్మాణం

గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

పి.నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

ఎనుమాముల మార్కెట్ పరిధిలోని గుత్తేదారులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించిన చెక్కులు ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్నాయి. కొంతకాలంగా గుత్తేదారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. మార్కెటింగ్ శాఖ ఈఈ ద్వారా గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లతోనే న్యాయం



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తుందని, నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా ప్రైవేటు రంగాల్లో కూడా రిజర్వేషన్ అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాజపా ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని సమాధి చేసే దిశగా ప్రయత్నాలను సాగిస్తుందని ధ్వజమెత్తారు. నూతన విద్య విధానంతో దళితులకు ఉన్నత విద్యను అందించాలని చూస్తుందని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. సీహెచ్.వెంకన్న, వి.శ్రావణ్, సాంబలక్ష్మి, కె.పాల్, చంద్రబోస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తొర్రూరు నియోజకవర్గం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సును టాటాఏస్ గూడ్స్ వాహనం ఢీకొట్టిన సమయంలో టాటా ఏస్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని నాంచారిమడూరు గ్రామశివారు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పంతిని గ్రామానికి చెందిన కె.బన్ని, సంతు ఆ వాహనంలో గొర్రెలు తీసుకుని తొర్రూరు నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్నారు. వరంగల్ నుంచి తొర్రూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్‌కు తరలించారు.

'అశాస్త్రీయం పెంపొందించడం సరికాదు'



ఐక్యత ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు

తొర్రూరు, న్యూస్‌టుడే: దేశంలో పరిపాలన దారితప్పి నిరంకుశ పాలనవైపు వెళ్తోందని, దీంతో ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదని సీపీఎం ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతోష్, సీపీఐ జిల్లా నాయకుడు భిక్షపతి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని అతిథి గృహంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో 'మత నిర్మూలన ఆచరణాత్మక కార్యక్రమం' అనే అంశంపై మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతం పేరుతో అశాస్త్రీయ విలువలు పెంపొందించడం సరికాదన్నారు. సమావేశంలో వివిధ పార్టీ నాయకులు వీరన్న, నాగమల్లయ్య, జనార్దన్, యాకమల్లు, ప్రసాద్, రాములు, పాపారావు పాల్గొన్నారు.

సామాజిక సేవ అలవరుచుకోవాలి



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

తొర్రూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవను అలవరుచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాములు తెలిపారు. జాతీయ ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రత విషయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముందుండాలన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వాల్యానాయక్, సుజాత, సీనియర్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శాంతికుమార్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దవంగర, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు రవికుమార్ అనారోగ్యంతో మృతిచెందగా, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్‌లోని వారి నివాసంలో దశదిన కర్మలో పాల్గొని కుటుంబ సభ్యులకు రూ.16వేల ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సురేష్, విద్యాసాగర్, కూడార్, విజయ్‌కుమార్, కవిరాజ్ తదితరులున్నారు.

హేతుబద్ధీకరణ ఉత్తర్వులపై ఉపాధ్యాయుల నిరసన



తొర్రూరులో...



మానుకోటలో..

నెల్లికుదురు, తొర్రూరు, కొత్తగూడ, కేసముద్రం, సీరోలు (కురవి), నర్సింహులపేట, దంతాలపల్లి న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల బదిలీల సమయంలో ఒక విధంగా సర్దుబాటులో మరో విధంగా వ్యవహరించడం సరికాదని వెంటనే హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కురవిరోడ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న హరివిల్లు శిక్షణ కార్యక్రమంలో హేతుబద్ధీకరణ ఉత్తర్వులను రేకెత్తు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనకు విరుద్ధంగా విద్యాశాఖ అనుసరిస్తున్న బడుల మూసివేత విధానాన్ని విరమించుకోవాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు బిక్షపతి, సుధీర్, శ్రీనివాస్, సరిరాం, మంగీలాల్, నరేష్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, అనసూర్య, స్వరూప, మంజుల, నాగరాజు తదితరులున్నారు. ఉత్తర్వుల జీవో నంబర్ 25ను వెంటనే ఉపసంహరించుకోవాలని తొర్రూరులో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు, కార్యదర్శులు విష్ణువర్ధన్‌రెడ్డి, ముత్తిలింగం డిమాండ్ చేశారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారు నిరసన వ్యక్తం చేసి, మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పోలేపల్లిలోని కస్తూర్బా గురుకులంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉత్తర్వులు అశాస్త్రీయంగా రూపొందించి అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించడం తగదని పేర్కొన్నారు. కేసముద్రంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గుండు సురేందర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సంఘ నేతలు, ఉపాధ్యాయులతో కలిసి ఉత్తర్వు సంఖ్య నెంబరు 25కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్ ఎస్‌టీయూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ అన్నారు. మంగళవారం సీరోలు మండలం కాంపల్లిలో ఆయన మాట్లాడారు. హేతుబద్ధీకరణ ఉత్తర్వులతో కొన్ని ప్రాథమిక పాఠశాలలను మూసివేసే విధంగా కుట్ర జరుగుతోందన్నారు. రేషనలైజేషన్ జీవో 25ను సవరించాలని కోరుతూ నర్సింహులపేట కాంప్లెక్స్ ఉపాధ్యాయులు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన నిర్వహించారు. ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, సురేష్ డిమాండ్ చేశారు. పెద్దముప్పారం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు.

ఐదు నెలలుగా పట్టించుకోని అంగన్‌వాడీ కేంద్రం



పెద్దవంగర మొదటి కేంద్రం వద్ద తాళం వేసి ఉన్న గేటు ముందు నిల్చున్న చిన్నారులు, తల్లులు

పెద్దవంగర, న్యూస్‌టుడే: పెద్దవంగర మండల కేంద్రంలోని ఉన్న మొదటి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో 35 మంది చిన్నారులు, బాలింతలు 1, గర్భిణులు 2 ఉన్నారు. కేంద్రానికి నిర్వాహకులు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండేళ్ల క్రితం టీచర్‌కు సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించడంతో అప్పటి నుంచి ఆయా ఒక్కరే కేంద్రంలో ఉంటూ నిర్వహణ చూస్తున్నారు. అయితే 5 నెలల కిందట ఆయాకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో ఆ కేంద్రాన్ని పట్టించుకునేవారే కరవయ్యారు. మంగళవారం వారు తాళం వేసి ఉన్న కేంద్రం గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. మూడో కేంద్రం టీచర్ రేణుక నెలకు ఒక్క సారి వచ్చి గుడ్లు, సత్తు పిండి ప్యాకెట్లు మాత్రమే ఇచ్చి వెళ్లిపోతున్నారని, రావాల్సిన పౌష్టికాహారం అందడం లేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని తాత్కాలిక టీచర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల, సిబ్బంది కొరత ఉంది. నూతన రిక్రూట్‌మెంట్ అయ్యేంత వరకు పెద్దవంగర మొదటి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులను సమీప కేంద్రాల్లో సర్దుబాటు చేస్తామని తొర్రూరు ఉప సీడీపీవో ఇందిర తెలిపారు.

ప్రిన్సిపల్‌ని మార్చాలని విద్యార్థినుల ఆందోళన



విద్యార్థినుల వాదన వింటున్న అధికారులు

దోర్నకల్, న్యూస్‌టుడే: దోర్నకల్‌లోని తెలంగాణ ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు - ఒకేషనల్) విద్యార్థినులు తమ ప్రిన్సిపల్‌ని మార్చాలని మంగళవారం ఆర్జాలితో ఆందోళనకు దిగారు. కళాశాల ఆవరణలోనే ఈ నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న రీజనల్ లెవెల్ కో-ఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ) రమేష్ వెంటనే కళాశాలకు చేరుకుని విద్యార్థినుల వాదన విన్నారు. ప్రిన్సిపల్ రాజుపడ తమను వేధించి అనుచిత వ్యాఖ్యలు చేశారని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తమను కించపరిచేలా భాష వినియోగించారని పేర్కొన్నారు. ఇది వారి అక్క, చెల్లి తల్లిదండ్రులు కలుగుతున్నారు. ఒకరిద్దరు విద్యార్థినులు తల్లిదండ్రుల వద్దకు పరుగెత్తుకెళ్లి జిల్లిపర్యంతం కావడం చూసి అక్కడున్న వారు కలిచివేశారు. కొందరు ప్రిన్సిపల్‌ని నిలదీశారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆందోళన విరమించి మధ్యాహ్న భోజనం చేయాలని ఆర్ఎల్‌సీ కోరారు. ప్రిన్సిపల్‌ని తక్షణం బదిలీ చేయాలని ఆపై డిమాండ్ చేశారు. దీంతో ఆయన మరోసారి వారికి సర్ది చెప్పి భోజనం చేసేలా ఒప్పించారు. ఆర్ఎల్‌సీ రాక ముందే ఇన్‌ఛార్జి తహసీల్దార్ వీరన్న, ఆర్ఐ యాసీన్, ఎస్సై మజీద్ కళాశాల వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ప్రిన్సిపల్ రాజుపడ మాట్లాడుతూ విద్యార్థినులు చేసిన ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

న్యాయం చేయాలని ఫ్లెక్సీ ప్రదర్శన

కేసముద్రం, న్యూస్‌టుడే: దళితబంధు పథకంలో డబ్బులు ఇప్పిస్తానని రూ.70 వేలు తీసుకున్న ఓ మాజీ ప్రజాప్రతినిధి నుంచి తన డబ్బులు తనకు తిరిగి ఇప్పించాలని కోరుతూ కేసముద్రం మండలం పెద్దమోరి తండా పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో అండె అనిల్‌మాదిగ పేరుతో మంగళవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. దళితబంధు ఇప్పిస్తానని చెప్పడంతో గొర్రెలు అమ్మి రూ.70వేలు ఇచ్చినట్లు ఫ్లెక్సీలో తెలిపారు. దళితబంధు రాకపోగా ఉన్న గొర్రెలు అమ్ముకోవడంతో తన కుటుంబం రోడ్డున పడిందని, తనకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

భూతగాదా కేసులో అయిదుగురికి జైలు

మరిపెడ, న్యూస్‌టుడే: భూమి తగాదా విషయంలో ఒకరిపై దాడిచేసి గాయపరచిన కేసులో అయిదుగురు నిందితులకు తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. 2015లో మరిపెడ మండలం జయ్యారంతండాకు చెందిన జరుపుల వెంకన్నపై అదే తండాకు చెందిన జర్పుల ప్రేమ్‌చంద్, రామారావు, లింగ్యా, శివ, రమేష్‌లు రాళ్లతో దాడిచేయగా వెంకన్న తలకు బలమైన గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కృష్ణకుమార్ నిందితులపై కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గణేష్ ఆనంద్, రేవతి వాదనలు వినిపించారు. సాక్షాధారాలను పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత అయిదుగురికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

మేము న్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499, డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

దోర్నకల్, న్యూస్‌టుడే: దోర్నకల్‌లో శివాలయం వైపునకు వెళ్లే రహదారి పక్కన పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. - రామారావు

● మరమ్మతు చేయిస్తాం. - వీరన్న, పుర ఛైర్మన్

వెలిగిన విద్యుద్దీపం

స్పందనకు వందనం

దోర్నకల్, న్యూస్‌టుడే: దోర్నకల్‌లోని సుభాష్‌వీధిలో వెలుగని వీధి దీపానికి సిబ్బంది మంగళవారం మరమ్మతులు చేశారు. పశువైద్యశాలకు వెళ్లే మార్గంలో వీధి దీపం వెలగడం లేదని స్థానికుడు రాజేష్ 'మేమున్నాం..మీకు తోడుగా'కి నివేదించగా సమస్య 'ఈనాడు'లో ప్రచురితమైంది. అందుకరం తొలగించిన పాదచారులు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేశారు



దంతాలపల్లి, న్యూస్‌టుడే: కుమ్మరికుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని ట్యాంక్ నుంచి మిషన్ భగీరథ జలాలు వృథాగా పోతున్నాయి. సమస్యపై మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

ఎన్ఎస్ఎస్‌తో సేవాగుణం

నెల్లికుదురు, నెల్లికుదురు, గార్ల న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవ కార్యక్రమం జిల్లాలోని పలు కళాశాలల్లో మంగళవారం నిర్వహించారు. మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నెల్లికుదురు జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.అనిల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. గార్ల జీజేసీలో ఎన్ఎస్ఎస్ పీవో ఎ.ప్రసాదరావును సత్కరించారు. సహాయ ప్రధానాచార్యుడు ఇస్తావత్ చాన్య, అధ్యాపకులున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మహేష్ (పాతచిత్రం)

మరిపెడ, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసి ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన మురారి మహేష్ (22) మంగళవారం మృతిచెందారు. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 20, 22వ తేదీల్లో ఓ యువతి తల్లిదండ్రులు తమ కుమార్తెను వేధిస్తున్నాడని నెపంతో అతడిపై దాడి చేశారు. ఈ క్రమంలో ఇరువురి కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురైన మహేష్ ఈ నెల 22న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందారు. చికిత్స పొందుతూ తన కుమారుడు మృతి చెందినట్లు అతడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

రైలులో ఒకరి మృతి

నెక్కొండ పోలీస్‌స్టేషన్: సికింద్రాబాద్ నుంచి విజయవాడ వెళ్లే శతవాహన ఎక్స్‌ప్రెస్ రైలులోని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ గాంధీ తెలిపిన వివరాల మేరకు.. రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో టికెట్ కలెక్టర్ రైల్వే మాస్టర్‌కు సమాచారం చేరవేశారు. 108 వాహన సిబ్బంది వచ్చి వచ్చి పరీక్షించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఆసుపత్రి శవాగారంలో భద్రపర్చినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ...

కామేపల్లి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మద్దివంచకు చెందిన కట్టెబోయిన వెంకటరత్నం(45) ఈ నెల 8న కామేపల్లి మండలం కొత్తలింగాలలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా తన భార్యతో కలిసి బైక్‌పై బయల్దేరారు. పండితాపురం సంత సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వెంకటరత్నం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఒద్దుగూడెంకి చెందిన అభినవ్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపారు.

విష ప్రయోగంతో కోళ్లు..

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని మాదాపురం శివారు ఇస్తావత్ తండా సమీపంలో గల వీరభద్ర పౌల్ట్రీ ఫాంలో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో 300 కోళ్లు మృతి చెందినట్లు ఫారం నిర్వాహకురాలు ఇస్తావత్ సుశీల తెలిపారు. మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు కోళ్ల మేతలో విషం కలుపడం వల్లనే మృతి చెందినట్లు ఆమె తెలిపారు.

22 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

నెల్లికుదురు, న్యూస్‌టుడే: నిబంధనలకు వ్యతిరేకంగా నిల్వ చేసిన 22 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్. రమేశ్‌బాబు తెలిపారు. రత్తిరాం తండా శివారు ఆవులేగ తండాకు చెందిన గుగులోతు నరేష్, నల్లగుట్టతండాకు చెందిన బానోత్ బాలు శివారు బెల్లం నిల్వ చేశారన్న సమాచారంతో గుగులోతు సుమన్ నివాసంలో నిల్వ చేశారన్నారు. తనిఖీ నిర్వహించిన సమయంలో 22 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు క్వింటాళ్ల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. సరకును స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

పాదచారుడ్ని ఢీకొట్టి.. పల్టీ కొట్టిన చేపల వాహనం!



చేపలు పట్టుకెళ్తున్న స్థానికులు

మరిపెడ, న్యూస్‌టుడే: చేపల లోడ్‌తో అతివేగంగా వెళ్తున్న ఓ వాహనం అదుపుతప్పి పాదచారుడిని ఢీకొట్టి పల్టీ కొట్టిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు పది క్వింటాళ్ల లైవ్ క్యాట్‌ఫిష్ లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ మరిపెడ బస్టాండ్ కూడలి వద్ద పాదచారుడిని ఢీకొట్టి పల్టీ కొట్టి పక్కనే ఉన్న బీరు వ్యాపారి వంట బండిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మరిపెడ మండలం వీరారం గ్రామానికి చెందిన పాదచారుడు జిన్న ఐలయ్య తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ నెల్లూరు జిల్లా కోల్లేరుకు చెందిన మంతశాల శ్రీనివాస్, నేపాల మంగారావు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంపై స్పందించిన స్థానికులు వాహనంలోని చేపలను తీసుకెళ్లారు. ప్రజలు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకోగా పోలీసులు వారిని అదుపు చేశారు.

సంక్షిప్తంగా

తిరుపతి లడ్డూ ప్రసాదంపై సీబీఐతో విచారణకు లేఖ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలతో పూర్తి స్థాయిలో సీబీఐ ద్వారా విచారణ జరిపించి అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత ప్రధాని, ముఖ్యమంత్రికి తపాలా కార్యాలయం ద్వారా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు మంగళవారం లేఖను పంపించారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు తెలిపారు.

రైలులో ఉపాధ్యాయులకు సత్కారం

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ఇనుగుర్తి, కురవి మండలాల అధ్యక్షులుగా భాస్కర్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మంగళవారం మహబూబాబాద్ నుంచి వరంగల్ వైపు వస్తున్న పుష్‌పుల్ రైలులో జయ్యారం పాఠశాలకు చెందిన సీనియర్ ఉపాధ్యాయులు పుల్లేరావ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుదర్శన్, రమేష్, ప్రకాష్‌రెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారిని సత్కరించారు. ప్రయాణికులు సత్కార కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



నర్సింహులపేటలో గర్భిణికి సీమంతం చేస్తున్న అధికారులు

నర్సింహులపేట: పోషకాహారంతోనే పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ చల్లా నాగరాజు, ఎంపీడీవో మాధవి, సీడీపీవో ఎల్లమ్మ అన్నారు. పోషణ మాసోత్సవాల పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు



వృద్ధుడిని తీసుకొస్తున్న పోలీసులు

సీరోలు (కురవి): కుటుంబ సభ్యుల నిరాదరణకు గురై అదృశ్యమైన వృద్ధుడిని సీరోలు పోలీసులు కాపాడారు. మరిపెడ మండలం ఉల్లేపల్లి శివారు తండాకు చెందిన వృద్ధుడు బానోత్ సిరి కానిస్టేబుళ్లు మతిస్థిమితం కోల్పోయిన విలిని శ్రీవీరభద్రస్వామి ఆలయం సమీపంలో ఉంటూ భిక్షాటన చేస్తున్నారు. అతడు సీరోలు మండలం కొత్తూరు(సి) శివారులోని పొలాల్లో తిరుగుతూ మంగళవారం కనిపించారు. గ్రామానికి చెందిన రైతులు చూసి 100 నంబరుకు డయల్ చేశారు. విద్యాసాగర్‌, రైతులు మల్లయ్య, రాంబాబు సహకారంతో పోలీసులు అతడిని తీసుకొచ్చారు. సీరోలు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులు కవితకు అప్పగించారు.

సాంకేతికత సాకుతో అన్యాయం!

గార్ల, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల్లో సాంకేతిక సమస్యలతో లబ్ధిదారుల నష్టం వాటిల్లుతోందని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక మంగపతిరావు భవనంలో మంగళవారం పార్టీ మండల కార్యవర్గ అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల్లో సాంకేతిక సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎంపీడీవో కార్యాలయానికి అనుమతులివ్వాలని కోరారు. స్థానిక సీహెచ్‌సీలో అదనపు వైద్యులను నియమించి 24 గంటలపాటు ఏఎన్ఎం ప్రజలకు సహాయం అందించాలని తెలిపారు. కవిత, సత్యవతి, నాగమణి, హరి, వీరస్వామి, రాజారావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కేసముద్రం: వృత్తిపై అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బద్దినారాయణ అన్నారు. ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన విజయసుశీల పదవీ విరమణ పొందారు. పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

భీమునిపాదం వద్ద సినిమా చిత్రీకరణ

గూడూరు: మండలంలోని సీతానగరం గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం వద్ద రెండు రోజులుగా జ్ఞానీదార్ అనే సినిమా చిత్రీకరిస్తున్నారు. చిత్రంలో మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్, మాజీ ఎంపీపీ చల్లాగి వెంకన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణాహ్మోహన్ రెడ్డి ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. సినిమా డైరెక్టర్ కేతు నరసింహారెడ్డి, సహనిర్మాత తేజకుమార్, కథానాయకుడు రాంబాబు, కథానాయకి కృష్ణవేణి, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ రాంబాబు, మంగీలాల్ ఉన్నారు.

గుంతలు పూడ్చివేత



గంగారం, న్యూస్‌టుడే: గంగారం మండలం ప్రధాన రహదారి తిరుమలగండి, పోలారం మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై గత నెల 28న 'రహదారుణం..!' శీర్షికన 'ఈనాడు'లో చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన గంగారం ఎస్సై రవికుమార్ సోమవారం గుంతలో మొరం మట్టిపోయించి పూడ్చివేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

శుభ్రతతో కూడిన భోజనం అందించాలి



దంతాలపల్లి ఎంజేపీ పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మురళీధర్

దంతాలపల్లి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారి డా. మురళీధర్ కోరారు. దంతాలపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ బాలుర, గిరిజన బాలుర వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వస్తే బాలుర వసతిగృహంలో బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెన్యూలు తప్పక గదులను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి చైతన్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వీరాసింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహంలో గొడవ..

గిరిజన బాలుర వసతి గృహం వార్డెన్ దాకూర్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరాసింగ్‌ల మధ్య గొడవ చోటు చేసుకుంది. జిల్లా వైద్యాధికారి తనిఖీ చేసి వెళ్లిన అనంతరం ఈ ఘటన చోటు చేసుకుంది. సరకుల నిల్వ గది తాళాలు సిబ్బందికి ఇవ్వకుండా వార్డెన్ తన వద్దే ఉంచుకోవడమేమిటని ప్రశ్నించారు. వసతి గృహంలో విద్యుత్ మీటరు కాలిపోయినప్పటికీ ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం చూపి విశుద్ధతలో వ్యవహరిస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులు వసతిగృహంపై దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

'కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం'

మరిపెడ, న్యూస్‌టుడే: దేశంలో రోజు రోజుకు పేదరికం, నిరుద్యోగం పెరుగుతోందని, దీంతో అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. దేశ రాజకీయాలకు ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. మరిపెడ మండలం గుండెపుడి గ్రామశాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాలు విద్య, వైద్యం, ఉద్యోగం వ్యాపారమయం చేయడాన్ని తప్పుపట్టారు. సామాన్యులకు దక్కని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం దక్కాలంటే అది కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్వాల వీరయ్య, మండల కార్యదర్శి జూలి వీరన్న, మండల ఆర్గనైజర్ బానాల రాజన్న, గ్రామ కార్యదర్శి గుండగాని మధుసూదన్, శాఖ కార్యదర్శి షరీఫ్ శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులున్నారు.